ప్రభుత్వ సేవలను చేరువ చేయడమే లక్ష్యం

- ఎమ్మెల్యే రక్షణనిధి
- రూ.కోటికిపైగా నిధులతో నిర్మించిన భవనాల ప్రారంభోత్సవం



ప్రారంభించిన విస్సన్నపేట సచివాలయం-1 ఎదుట ఎమ్మెల్యే రక్షణనిధి, నాయకులు

విస్సన్నపేట: ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకే గ్రామ సచివాలయాలు ఏర్పాటయ్యాయని ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి అన్నారు. విస్సన్నపేటలో రూ.1.01 కోట్లతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం-1, ఆర్‌బీకే, 3వ సచివాలయం వద్ద ఆర్‌బీకే, గ్రామీణ హెల్త్ క్లినిక్ భవనాలను ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ గతంలో గ్రామ పంచాయతీ కార్యాలయం ఒక్కటే ఉండేదన్నారు. నేడు ప్రజల సౌకర్యార్థం నాలుగు సచివాలయాలను ఏర్పాటు చేశామని తెలిపారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అని చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరు తెలుసుకోవటంతో పాటు అర్హత ఉండి పథకాలు అందని వారికి సంక్షేమ పథకాలు అందేలా చేశామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పాలన కొనసాగిస్తున్నారని తెలిపారు. మండలంలో పేదలకు నివేశన స్థలాలు పంపిణీ చేశామన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన ప్రాంతాల్లో సీసీరోడ్లు నిర్మించామని వివరించారు. గత ప్రభుత్వం లాగ మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వం అని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి, జెడ్పీటీసీ భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, సర్పంచ్ సాధుపాటి నాగమల్లేశ్వరి, కేడీసీసీబీ డైరెక్టర్ భూక్యా రాణి, వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యుడు ప్రకాష్, పట్టణ అధ్యక్షుడు నెక్కళపు కుటుంబరావు, వైస్ ఎంపీపీ రెడ్డి శ్రీనివాసరావు, మాజీ వైస్ ఎంపీపీ ఓలేటి దుర్గారావు, ఏఎంసీ డైరెక్టర్ రెడ్డి శేషగిరి, ఉపసర్పంచ్ సత్యనారాయణరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు రెడ్డి ముత్యాలు, ఎంపీటీసీ జి.మల్లయ్య, తహసీల్దార్ చంద్రశేఖర్, పీఆర్‌డీఈ చక్రవర్తి, ఏఓ రాజ్యలక్ష్మి, ఈఓపీఆర్డీ ఝాన్సీరాణి, ఈఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మట్టి సేకరణ



మైలవరం: బీజేపీ ప్రభుత్వ ఆదేశాల మేరకు మైలవరం మండల శాఖ ఆధ్వర్యంలో నా మట్టి-నాదేశం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు రేగళ్ళ రఘునాథరెడ్డి తెలిపారు. మైలవరం మండల శాఖ ఆధ్వర్యంలో స్థానిక నూజివీడు రోడ్డులోని వినాయకుని గుడి వద్ద బుధవారం మట్టిని సేకరించారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామం నుంచి సేకరించిన మట్టిని దేశ రాజధాని ఢిల్లీలో పవిత్ర అమృత వాటిక నిర్మాణానికి ఉపయోగిస్తారన్నారు. బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు పీ వెంకటేశ్వరరావు, ధార్మిక సెల్ కన్వీనర్ పీ దశరథి, నాయకులు గంగాధరరావు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వాసవీ సభ్యుల గోసేవ

తిరువూరు: వాసవీ క్లబ్ వ్యవస్థాపకుడు కేసీ గుప్తా జయంతి వారోత్సవాల్లో భాగంగా బుధవారం తిరువూరు క్లబ్ సభ్యులు గోసేవ కార్యక్రమం నిర్వహించారు. స్వామి అయ్యప్ప దేవాలయంలోని గోశాలలో గోవులకు అవసరమైన గ్రాసం అందించారు. పలువురు జర్నలిస్టులను సత్కరించారు. వాసవీ, వనిత, యూత్, సీనియర్ సిటిజన్ క్లబ్బుల సభ్యులు నాళ్ళా వెంకట రామారావు, నాళ్ళా సూర్యప్రకాశరావు, కూన పవన్‌కుమార్, దోసపాటి రవికుమార్, చిత్తలూరి నరసింహరాజు, నాళ్ళా కృష్ణారావు, కోరుకొండ వెంకటేశ్వరరావు, దారా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి శిలలు రాక



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీస్వయంభు శంభులింగేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి అవసరమైన రాతి శిలలు బుధవారం తమిళనాడు నుంచి నాలుగు ప్రత్యేక లారీల్లో గ్రామానికి చేరుకున్నాయి. వాటిని గ్రామంలోని చెరువుకట్ట ఆంజనేయ స్వామి ఆలయం వద్ద నుంచి గ్రామంలో ఊరేగింపుగా దేవాలయం వద్దకు చేర్చారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు వాసిరెడ్డి బెనర్జీ మాట్లాడుతూ ఆరు నెలలుగా తమిళనాడులో రూ.60 లక్షల విలువ కలిగిన రాతి శిలలను తయారు చేయించి గ్రామానికి తీసుకొచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, సొసైటీ అధ్యక్షుడు గింజుపల్లి నర్సయ్య, మండల సమాఖ్య అధ్యక్షురాలు కాకాని పద్మ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాసరావు, ఆలయ మాజీ చైర్మన్ వెంకటనారాయణ పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): యువతి అదృశ్యంపై ఆమె తండ్రి ఫిర్యాదు మేరకు కొత్తపేట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిట్టినగర్ రాయప్పరాజు వీధికి చెందిన నాగ వెంకట శంకరరావు టైలరింగ్ పని చేసుకుని జీవనం సాగిస్తుంటాడు. శంకరరావుకు ఇద్దరు సంతానం కాగా డిగ్రీ వరకు చదివిన కుమార్తె, ప్రస్తుతం బ్యూటిషియన్ కోర్సు నేర్చుకుంటోంది. ఈనెల 5వ తేదీ బ్యూటీ పార్లర్‌కు వెళ్లిన కుమార్తెను తీసుకువచ్చేందుకు శంకరరావు ఫోన్ చేయగా, డ్యూటీకి రాలేదని చెప్పారు. దీంతో ఆందోళన చెందిన ఆయన బంధువులు, స్నేహితులను ఆరా తీశారు. అయినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

రేపు వాహనాల వేలం

చిల్లకల్లు(జగ్గయ్యపేట): ఎక్సైజ్ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలకు శుక్రవారం వేలం నిర్వహించనున్నట్లు ఎస్‌ఐ కృష్ణబాబు బుధవారం తెలిపారు. చిలకల్లు, వత్సవాయి పోలీస్ స్టేషన్ల పరిధిలో ఎక్సైజ్ కేసుల్లో సీజ్ చేసిన 14 వాహనాలకు వేలం పాట జరుగుతుందని పేర్కొన్నారు. పోలీస్ కమిషనర్, ఎస్‌ఈబీ ఆధ్వర్యంలో గ్రామంలోని పశువుల సంత వద్ద ఉదయం తొమ్మిది నుంచి వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి

కంచికచర్ల: వాతావరణంలో వచ్చిన మార్పులు, కురుస్తున్న వర్షాల కారణంగా సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని లేకపోతే ప్రజలు అంటు వ్యాధుల బారిన పడతారని ఎంపీడీఓ కే బాలశంకరరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా గ్రామాల్లో బ్లీచింగ్ చల్లించటంతో పాటు దోమల వ్యాప్తిచెందకుండా ఎబేట్‌ను పిచికారీ చేయించాలన్నారు. అంతేకాకుండా డ్రెయినేజీల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు పర్యవేక్షించాలన్నారు.

ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి


మైలవరం గిరిజన పాఠశాలలో వివిధ వేషధారణలతో విద్యార్థులు


ఆగిరిపల్లిలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మైలవరం: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు మైలవరంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. దుష్టశిక్షణ, శిష్ట రక్షణ కోసం ఈ భువిపై అవతరించిన అవతార పురుషుడు శ్రీకృష్ణ భగవానుడు అని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. శ్రీకృష్ణుని ఆశీస్సులు ప్రజలకు సమృద్ధిగా లభించాలని ఆ సందర్భంగా ఆకాంక్షించారు. నియోజకవర్గ ప్రజలకు శ్రీకృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలిపారు. మైలవరం శ్రీలీలావతి గిరిజన పాఠశాలలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు యూ లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థులు వివిధ వేషధారణలతో అలరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉట్టికొట్టి తోటి విద్యార్థులను ఉల్లాస పరిచారు. స్థానిక పాఠశాలల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

ఎ.కొండూరు: మండలంలోని కంభంపాడు, ఎ.కొండూరు, చీమలపాడు, గొల్లమందల పలు గ్రామాల్లో బుధవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కంభంపాడు, గొల్లమందల, గ్రామాల్లో శ్రీవేణుగోపాలస్వామి ఆలయాల్లో అభిషేకాలు, అర్చనలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయా గ్రామాల్లోని యువకులు, చిన్నారులు ఉత్సాహంగా ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని జరుపుకున్నారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు

నూజివీడు (ఆగిరిపల్లి): ఆగిరిపల్లిలోని మెట్ల కోనేరు వద్ద ఉన్న శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో బుధవారం కృష్ణాష్టమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. వేకువజామున స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకం చేశారు. అనంతరం వేదపండితులు స్వామివారి కల్యాణం నిర్వహించారు. ఈ కల్యాణంలో కందుల శ్రీమన్నారాయణ, కందుల నాగరాజు దంపతులు పాల్గొన్నారు. అనంతరం కృష్ణ యువసేన ఆధ్వర్యంలో భారీ అన్నదానం నిర్వహించారు. సాయంత్రం ఉట్టి కొట్టే కార్యక్రమం అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు.

నేడు 'ఆడుదాం ఆంధ్రా'పై సమీక్ష

నూజివీడు: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంపై గురువారం మధ్యాహ్నం 2 గంటలకు సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వీఏ విజయ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని మండల పరిషత్ పాఠశాలలు, జెడ్పీ హైస్కూళ్ల హెచ్‌ఎంలు, పీఈటీలు, ఎంఈవోలు హాజరవ్వాలని ఎంపీడీవో పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం విధి విధానాలు, నిర్వహణకు సంబంధించిన ప్రణాళిక తదితర అంశాలపై సమీక్ష నిర్వహిస్తామన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

నూజివీడు: పట్టణంలోని ఎల్ఐసీ కార్యాలయ ఆవరణలో ఈనెల 8న ఎల్ఐసీ, వాసవీక్లబ్, ఏపీ ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు వంగల గోవిందరావు బుధవారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహించే ఈ శిబిరాన్ని ఎల్ఐసీ బ్రాంచి మేనేజర్ కే సుధాకర్, వాసవీక్లబ్ జిల్లా గవర్నర్ మాజేటి రామచంద్రరావు ప్రారంభిస్తారన్నారు. ఈ శిబిరంలో అన్ని రకాల వ్యాధులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తారన్నారు. ఎల్ఐసీ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

నేడు మండలంలో ఎమ్మెల్యే పర్యటన

ముసునూరు: నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు గురువారం ముసునూరు మండలంలో పర్యటించనున్నట్లు ఎంపీడీఓ జి.రాణి బుధవారం చెప్పారు. ముసునూరులో జరుగనున్న నూతన పింఛన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. మధ్యాహ్నం ఒంటి గంటకు ప్రారంభం కానున్న ఈ కార్యక్రమానికి అధికారులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

అదృశ్యంపై కేసు నమోదు

ముసునూరు: ఇద్దరు పిల్లలతో సహా వివాహిత అదృశ్యమైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనిపై ముసునూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్ఐ ఎం.కుటుంబరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చింతలవల్లికి చెందిన పల్లిపాము గంగయ్య కుమార్తె మౌనిక (21)ను విజయవాడకు చెందిన ఇడుపులపాటి రాజేష్‌కు ఇచ్చి వివాహం చేశారు. భార్యా భర్తలిద్దరికీ తరచుగా గొడవలు జరుగుతుండడంతో గత నాలుగు నెలలుగా పుట్టింట వద్దనే ఉంటోంది. ఈ నేపథ్యంలో మౌనిక తన కుమారులు దినేష్ (3), ఇషాకా (1)లతో సహా ఈనెల మూడో తేదీ నుంచి కనిపించకుండా పోయింది. బంధువులు, తెలిసిన వారి ఇళ్ల వద్ద ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో గంగయ్య ముసునూరు పోలీసులకు మంగళవారం రాత్రి ఫిర్యాదు చేశాడు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు ఉట్టి ఉత్సవం

గంపలగూడెం: శ్రీకృష్ణుని జన్మాష్టమి సందర్భంగా గురువారం మండలంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. గంపలగూడెం రామాలయంలో సహస్ర దీపోత్సవం, ఉట్టి ఉత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఉపాధ్యక్షుడు కోదండరాం, అధ్యక్షుడు శ్రీధరాచార్యులు తెలిపారు. గంపలగూడెం భజన మందిరంలో వికాస తరంగిణీ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ పరమాత్మకు విశేష పూజలు, 111 ప్రసాదాలతో స్వామికి నైవేద్యం సమర్పిస్తున్నట్లు అధ్యక్షురాలు కొల్లా కృష్ణకుమారి తెలిపారు. నెమలి శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామికి అభిషేకం, అర్చనలు, ఉట్టి ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాటు చేసినట్లు సహాయ కమిషనర్ డి.శ్రీరామవర ప్రసాదరావు తెలిపారు.

పలువురికి ఎమ్మెల్యే పరామర్శ


సీతారామపురం సర్పంచి అత్తి మురళిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు(ఆగిరిపల్లి): ఆగిరిపల్లి మండలంలోని సీతారామపురం సర్పంచ్ అత్తి మురళి తండ్రి అత్తి వెంకట రామయ్య మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు బుధవారం రాత్రి మురళి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. తోటపల్లికి చెందిన వైఎస్సార్ సీపీ యువజన విభాగం మండల అధ్యక్షుడు బెజవాడ హర్ష అత్త మృతి చెందగా ఎమ్మెల్యే ప్రతాప్ ఆయన ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పలగాని నరసింహారావు, జెడ్పీటీసీ సభ్యులు పిన్నిబోయిన వీరబాబు, నాయకులు గోళ్ల ఇస్సాకు, సాగి పవన్ కుమార్, చిన్ని పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై మాట్లాడే అర్హత టీడీపీకి లేదు

వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిదులు, నాయకులు


మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

నూజివీడు: నూజివీడు నియోజకవర్గంలో గతంలో జరిగిన, ఇప్పుడు జరుగుతున్న అభివృద్ధి గురించి మాట్లాడే అర్హత టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావుకు లేదని వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు స్పష్టం చేశారు. పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు పగడాల సత్యన్నారాయణ, కొమ్ము వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, క్రిస్టియన్ మైనారిటీ విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షుడు పిళ్లా చరణ్, నాయకులు ఆరేపల్లి రాంబాబు, హరికోటి ప్రసాద్‌లు విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. మద్య నిషేధం ఎత్తేసిన చంద్రబాబు నాయకత్వంలో పనిచేస్తూ దాని గురించి మీరు మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందన్నారు. చంద్రబాబు అసెంబ్లీలో నూజివీడు ప్రాంతంలో రాజధానిని ఏర్పాటు చేస్తామని ప్రకటించారని, ఆ వివరాలు అసెంబ్లీ రికార్డులో ఉంటుందని, అక్కడకు వెళ్లి చూసుకోవచ్చని సూచించారు. నూజివీడులో ట్రిపుల్‌ఐటీ ఏర్పాటు వల్ల ఈ ప్రాంతంలోని వందలాది కుటుంబాల వారు ఉద్యోగాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని, పేదవర్గాలకు చెందిన పిల్లలు సాంకేతిక విద్యను అభ్యసిస్తూ జీవితంలో ఉన్నత స్థానాల్లో స్థిరపడుతున్నారన్నారు. ఈ విషయం కూడా ముద్దరబోయిన వెంకటేశ్వరరావుకు తెలియకపోవడం ఆయన అజ్ఞానానికి నిదర్శనమన్నారు. టీడీపీ ప్రభుత్వ పాలనలో ట్రిపుల్‌ఐటీ మురుగునీటి సమస్యను పరిష్కరించకుండా నిద్రపోయావా అని ముద్దరబోయినను ప్రశ్నించారు. తమ ప్రభుత్వ హయాంలో రూ.3.50 కోట్లతో అంచనాలు రూపొందించి టెండర్లు పిలుస్తున్నామన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో దాదాపు 11 వేల మంది పేదలకు నివేశన స్థలాలు ఇవ్వడమే కాకుండా ఇళ్లు కూడా మంజూరు చేశామన్నారు. టీడీపీ హయాంలో ఒక్క నివేశన స్థలమైనా ఇచ్చారా అని నిలదీశారు. బైపాస్ రోడ్డు నిర్మాణం, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌లు త్వరలోనే జరుగుతాయని, క్రికెట్ గ్రౌండ్ అభివృద్ధి పనులు ఇప్పటికే జరుగుతున్నాయన్నారు. పీజీ సెంటర్‌లో రూ.6 కోట్లతో నిర్మించిన అకడమిక్ భవనం, హాస్టల్ భవనాన్ని త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి శూన్యమన్నారు. వచ్చే ఎన్నికల్లో టికెట్ వస్తుందో, లేదో తెలియని మీరు అసత్య ఆరోపణలు చేయడం మానుకుని వాస్తవాలు తెలుసుకుంటే మంచిదని వారు ఈ సందర్భంగా హితవు పలికారు.

జగనన్న సురక్షతో పెరిగిన పింఛన్లు


కొత్త పింఛన్లు అందజేస్తున్న కౌన్సిలర్, వైఎస్సార్ సీపీ నాయకులు, వలంటీర్లు

ఇబ్రహీంపట్నం: ప్రభుత్వం ఇటీవల కాలంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంతో అర్హతగల వారికి ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయడంతో పలువురు నూతన సామాజిక పింఛన్లకు అర్హత సాధించారు. ఈనెలలో కొండపల్లి మున్సిపాల్టీలో 10వ వార్డు సచివాలయాల పరిధిలో 97 మందికి పింఛన్లు మంజూరు అయ్యాయి. వైఎస్సార్ సీపీ నాయకులు వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులతో కలిసి నూతన పింఛన్‌దారులకు బుధవారం నగదు అందజేశారు. ఈ సందర్భంగా లబ్దిదారులు హర్షం వ్యక్తం చేశారు. వార్డు కౌన్సిలర్ నల్లమోతు లక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు లంకే అంకమోహనరావు, నల్లమోతు చిన్నయ్య, దయాకర్, పండు, తదితరులు పాల్గొన్నారు.

కేయూ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యురాలికి సత్కారం


సుభాషిణీని సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ రవి, అధ్యాపకులు, సిబ్బంది

మైలవరం: కృష్ణ యూనివర్శిటీ పరిధిలో ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యురాలిగా నామినేట్ అయిన మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇంగ్లిష్ అధ్యాపకురాలు బి.సుభాషిణీని బుధవారం సత్కరించారు. మూడు సంవత్సరాలపాటు పదవిలో కొనసాగుతారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్లరవి తెలిపారు. తమ కళాశాలకు చెందిన అధ్యాపకురాలు సుభాషిణికి ఈ పదవి లభించడం అభినందనీయమన్నారు. తమ కళాశాలకు ప్రత్యేకగుర్తింపు లభించిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది తరఫున సుభాషిణిని అభినందించారు.

నిబంధనలు పాటించని బల్లకట్టు నిర్వాహకులు

కేసు నమోదు చేసిన పోలీసులు


బల్లకట్టు రికార్డులను పరిశీలిస్తున్న ఏసీపీ జనార్దన్ నాయుడు

నందిగామ(చందర్లపాడు): బల్లకట్టు నిర్వాహకులు నిబంధనలు పాటించకపోతే చర్యలు కఠినంగా ఉంటాయని ఏసీపీ జనార్దన్‌నాయుడు హెచ్చరించారు. చందర్లపాడు మండలం గుడిమెట్ల సమీపంలో కృష్ణానదిలో తిరిగే బల్లకట్టు ప్రాంతాన్ని బుధవారం సాయంత్రం ఏసీపీ తనిఖీ చేశారు. బల్లకట్టు రికార్డులు పరిశీలించారు. బల్లకట్టు నిర్వాహకులు కనీస నిబంధనలు పాటించడం లేదని వస్తున్న ఫిర్యాదులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అదేవిధంగా నదిలో తిరిగే పడవల అనుమతులకు సంబంధించిన పత్రాలను పరిశీలించారు. పడవల నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ బల్లకట్టు నిర్వాహకులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలన్నారు. బల్లకట్టును కేవలం పగటి సమయంలో మాత్రమే నడపాలని ఆ విధంగా కాకుండా సూర్యాస్తమయం తర్వాత బల్లకట్టును నడిపితే సీజ్ చేయనున్నట్లు హెచ్చరించారు. ముఖ్యంగా బల్లకట్టులో ప్రయాణించే ప్రతి ప్రయాణికుడు తప్పనిసరిగా లైఫ్ జాకెట్ ధరించే విధంగా చూడాల్సిన బాధ్యత నిర్వాహకులదే అని పేర్కొన్నారు. ప్రయాణికుల వద్ద నుంచి వసూలు చేసే చార్జీల వివరాలకు సంబంధించిన ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దని సూచించారు. కార్యక్రమంలో రూరల్ సీఐ నాగేంద్ర కుమార్, చందర్లపాడు ఎస్సై రామకృష్ణ పాల్గొన్నారు.

నేడు నూతన పింఛన్లు పంపిణీ చేయనున్న ఎమ్మెల్యే

నూజివీడు: రాష్ట్ర ప్రభుత్వం అర్హులకు మంజూరు చేసిన నూతన పింఛన్లను గురువారం ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నట్లు నూజివీడు, ఆగిరిపల్లి ఎంపీడీవోలు వీఏ విజయ్‌కుమార్, పీ శంకర్‌రావు బుధవారం తెలిపారు. నూజివీడు పట్టణం, మండలానికి చెందిన పింఛన్లను స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఉదయం 10 గంటలకు నిర్వహించే కార్యక్రమంలో అందజేస్తారన్నారు. ఆగిరిపల్లిలోని పొన్నం కల్యాణ మండపంలో ఉదయం 11 గంటలకు నిర్వహించే కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రతాప్ చేతుల మీదుగా కొత్త పింఛన్లు అందజేస్తారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వలంటీర్లు, సెక్రటరీలు, లబ్ధిదారులు పాల్గొనాలని వారు విజ్ఞప్తి చేశారు.

31 బైక్‌లు వేలం


గంపలగూడెంలో మోటార్ బైకుల బహిరంగవేలం నిర్వహిస్తున్న అధికారులు

గంపలగూడెం: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం నిర్వహించిన బహిరంగ వేలంలో 31 బైక్‌లను విక్రయించినట్లు ఎస్ఐ రాంబాబు తెలిపారు. అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ యూ సుబ్బారావు పర్యవేక్షణలో వేలం జరిపారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యం సీసాల అక్రమ రవాణా, ఎక్సైజ్, సారా విషయమై నమోదు చేసిన కేసుల్లో పట్టుబడిన బైకులను ఉన్నతాధికారుల ఆదేశానుసారం బహిరంగ వేలం ద్వారా విక్రయించారు. స్టేషన్ స్వాధీనంలో ఉన్న బైకుల్లో మొదటి విడతగా 52 బైకులను విక్రయించేందుకు అధికారులు వేలం నిర్వహించారు. వాటిలో 31 బైకులను పాటదారులు కైవసం చేసుకున్నారు. బైకుల విక్రయం ద్వారా రూ.5,12,746 వచ్చినట్లు ఎస్ఐ తెలిపారు. స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఎం నేతల నిరసన ప్రదర్శన


నిరసన ప్రదర్శన చేస్తున్న సీపీఎం నాయకులు

రెడ్డిగూడెం: సీపీఎం సమరభేరిలో భాగంగా బుధవారం మండల కమిటీ ఆధ్వర్యంలో రెడ్డిగూడెంలో నిరసన ప్రదర్శన, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం సీనియర్ నాయకులు మద్దిరెడ్డి మాధవరెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు అవలంభిస్తూ దేశ ప్రజలను మోసం చేస్తూ మభ్యపెడుతుందన్నారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని, విద్యుత్ చార్జీలను తగ్గించాలని, నిరుద్యోగ సమస్య పరిష్కారించాలని డిమాండ్ చేశారు. గ్యాస్‌ను రూ.400లకే ఇవ్వాలని, సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీపీఎం మండల కార్యదర్శి జంగా వెంకటరెడ్డి, ఉయ్యూరు కృష్ణారెడ్డి, చాట్ల విజయ్‌కుమార్, గద్దల ఇశ్రాయేలు, అప్పిరెడ్డి, గోపయ్య, తదితరులు పాల్గొన్నారు.

కరాటే విజేతలకు అభినందన


విజేతలు షణ్ముఖి, కృష్ణ యాదవ్‌లను అభినందిస్తున్న అకాడమీ నిర్వాహకులు, కోచ్

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఈ నెల 3న కర్నూలులో జరిగిన 11వ జాతీయ స్థాయి ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ -2023లో జెకె గోజురై కరాటే అకాడమీ సత్యనారాయణపురం బ్రాంచ్‌కి చెందిన బాలికల కేటగిరి అండర్ 18 విభాగంలో షణ్ముఖి ప్రథమ స్థానంలో నిలిచింది. అలాగే బాయ్స్ కేటగిరి అండర్ 10 విభాగంలో కృష్ణ యాదవ్ తృతీయ స్థానంలో నిలిచాడు. ఈ సందర్భంగా కరాటే పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిద్దరినీ అకాడమీ వ్యవస్థాపకులు శ్రీనివాసులు, టెక్నికల్ డైరెక్టర్ జె.హరినాథ్, సత్యనారాయణపురం బ్రాంచ్ కోచ్ పీవీకెఎస్ హర్ష అభినందించారు. గొల్లపూడిలోని జెకె గోజురై కరాటే అకాడమికి సంబంధించి నగరంలోని వివిధ బ్రాంచిల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు భవిష్యత్‌లో జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ


సీసీ రోడ్డుకు భూమి పూజ కార్యక్రమంలో చైర్‌పర్సన్, అధికారులు, నాయకులు

తిరువూరు: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరైన నిధులతో తిరువూరు 9వ వార్డులో చేపట్టిన సీసీ రహదారుల నిర్మాణానికి నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి బుధవారం భూమిపూజ చేశారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కింద రూ.2 కోట్ల నిధులు మంజూరైనట్లు చైర్‌పర్సన్ తెలిపారు. వైస్ చైర్‌పర్సన్లు విజయలక్ష్మి, వెంకటేశ్వరి, వార్డు కౌన్సిలర్లు తంగిరాల వెంకటరెడ్డి, మూడు దుర్గారావు, పరసా శ్రీనివాసరావు, మోదుగు ప్రసాద్, ఇన్‌చార్జి కమిషనర్ బాలకృష్ణ పాల్గొన్నారు.